క్లుప్తంగా

ఘనంగా ఆదిత్యుని కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు శంకరశర్మ

అరసవల్లి: ప్రత్యక్షదైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి కల్యాణోత్సవం శుక్రవారం కార్తీక బహుళ ఏకాదశి సందర్భంగా ఘనంగా జరిగింది. ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఇప్పిలి సాందీప్ శర్మ నేతృత్వంలో ఉషా పద్మిని ఛాయా దేవేరులతో శ్రీవారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి ఆగమశాస్త్ర ప్రకారం కల్యాణం జరిపించారు. కల్యాణ సేవకు హాజరైన భక్త దంపతులకు శేషవస్త్రాలు, తలంబ్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈవో వి.హరిసూర్యప్రకాష్ పాల్గొన్నారు.

పుస్తకాల వితరణ



పుస్తకాలు అందజేస్తున్న దాతలు

రణస్థలం: చినపట్నానపేట ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులకు పుస్తకాలు, అట్టలు, పెన్సిళ్లు, బ్యాగ్‌లు ఉచితంగా అందజేశామని ఎన్‌పీసీఐఎల్ చీఫ్ ఇంజినీర్ బంగారయ్య శెట్టి తెలిపారు. న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్ సామాజిక కార్పొరేట్ బాధ్యతలో భాగంగా వీటిని శుక్రవారం అందించామన్నారు. కార్యక్రమంలో ఎన్‌పీసీఐఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.దేవరా, సీఆర్‌పీ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఖోఖో పోటీల్లో కొచ్చెర్ల విద్యార్థిని ప్రతిభ



భవానీని సన్మానిస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది

రణస్థలం: పల్నాడు జిల్లా నరసారావుపేటలో జరిగిన 33వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ ఖోఖో పోటీల్లో శ్రీకాకుళం జట్టు ప్రథమ స్థానం సాధించినట్లు కొచ్చెర్ల హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కిల్లి తిరుపతిరావు తెలిపారు. జిల్లా జట్టుకు తమ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న విద్యార్థిని జీరు భవాని ప్రాతినిధ్యం వహించినట్టు పేర్కొన్నారు. భవానీని శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది సన్మానించి అభినందించారు. వ్యాయామ ఉపాధ్యాయులు వి.సత్యవతి, ఎం.వెంకటరమణ, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

శ్రీకాంత్‌కు పరామర్శ



శ్రీకాంత్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ ఇటీవల తన ఇంట్లో కాలుజారిపడి గాయపడటంతో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ శుక్రవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు.

బాల్య వివాహాలు అరికట్టాలి



అవగాహన కల్పిస్తున్న మల్లేశ్వరరావు

రణస్థలం: బాల్య వివాహాలను అరికట్టాలని బాలల రక్షణ విభాగం రక్షణాధికారి ఎం.మల్లేశ్వరరావు అన్నారు. రణస్థలం, లావేరు మండలాల్లోని ఎంఎస్‌కేలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లతో 'బేటీ బచావో బేటీ పడావో'కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్న వయస్సులో వివాహాలు చేయడం వలన ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. ఆడ శిశు మరణాలు తగ్గించాలని, బాల, బాలికలు చక్కగా చదువుకునేలా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సిబ్బంది ఎ.గీత, ఏసీ డీపీఓ సుగుణ, సూపర్‌వైజర్లు ఉష, మంగమ్మ, గౌరమ్మ, కృష్ణవేణి పాల్గొన్నారు.

10న పట్టుశాలి కార్తీక సమారాధన

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం పట్టణ పట్టుశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 10న తోటపాలెం సమీపంలో వెంకన్నగారిపేట తోటలో కార్తీక వనభోజనం మహోత్సవం నిర్వహించనున్నట్లు సంఘ అధ్యక్షుడు గుంటుకు చంద్రశేఖరరావు, సెక్రటరీ పేకల రామకృష్ణారావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పట్టుశాలి కులస్తులంతా హాజరుకావాలని పిక్నిక్ కమిటీ చైర్మన్ బస్వా చక్రధరరావు, సెక్రటరీ మాడుగుల శ్రీనివాసరావు తదితరులు కోరారు.

రాష్ట్రంలో పారదర్శక పాలన



శ్రీకాకుళం రూరల్: పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు

గార: రాష్ట్రంలో పారదర్శక పాలన సాగుతోందని గార ఎంపీపీ గొండు రఘురామ్ అన్నారు. శుక్రవారం తోనంగి సచివాలయంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల, మత, ప్రాంత అన్న భేదం లేకుండా అర్హులందరికీ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సంజీవ రమణయ్య, మండల పార్టీ కన్వీనర్ పీస గోపి, లక్ష్మణ, సుగ్గు మధురెడ్డి, వైస్ ఎంపీపీ అరవల రామకృష్ణ, పీస శ్రీహరిరావు, కొయ్యాన నాగభూషణం, గుజ్జల అప్పలరాజు పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్: కులం, మతం, జెండా వంటివి చూడకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ అని యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు అన్నారు. పొన్నాం సచివాలయంలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్న వైఎస్సార్ సీపీనే మళ్లీ గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం

జి.సిగడాం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తోనే సంక్షేమం సాధ్యమని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. వెలగాడ గ్రామ సచివాలయంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, జేసీఎస్ కన్వీనర్ డోల వెంకటరమణ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఏర్నేన ప్రకాశరావు, సర్పంచులు భూపతి సురేష్‌కుమార్, బొల్లా జనార్దనరావు, ఎంపీటీసీ సభ్యురాలు పట్నాన శాంతి, నాయకులు బలగ త్రినాథ్, సత్యన్నారాయణ, భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శి సీహెచ్ సురేష్‌కుమార్ పాల్గొన్నారు.



గార: తోనంగిలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ రఘురామ్



జి.సిగడాం: సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న నాయకులు

రక్తదానంతో ప్రాణదాతలు కండి



రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం కల్చరల్: విపత్కర పరిస్థితుల్లో ఉన్నవారికి రక్తాన్ని దానం చేసి ప్రాణాలు కాపాడుదామని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. నగరంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు మెయిన్ బ్రాంచిలో శుక్రవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. బ్యాంకు సేవా కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం సుమారు 40మంది రక్తదానం చేశారు. రక్తదాతలకు ధ్రువపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో డీపీఆర్‌వో కె.బాలమాన్‌సింగ్, రెడ్‌క్రాస్ కార్యదర్శి బలివాడ మల్లేశ్వరరావు, సభ్యులు పి.శ్రీకాంత్, చైతన్య, బ్యాంకు మేనేజర్ ఎ.శేఖర్, హెడ్ ఎస్.ప్రసాద్, యూనిట్ హెడ్ శశిధర్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ధాన్యం గింజా కొంటాం



ధాన్యం కొనుగోలు ప్రారంభిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

శ్రీకాకుళం రూరల్: రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఆర్డీఓ రంగయ్య తెలిపారు. బైరి గ్రామంలో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళారుల ప్రమేయం లేకుండా మద్దతు చెల్లించి ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేస్తుందన్నారు. మిల్లర్ల వద్దకు క్యూ కట్టాల్సిన పనిలేకుండా రైతు వద్దకు నేరుగా వచ్చి ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. అగ్రికల్చర్ జేడీ శ్రీధర్ మాట్లాడుతూ తడిచిన ధాన్యం వివరాలను ఆర్‌బీకే సిబ్బంది సమక్షంలో ప్రత్యేకంగా నమోదు చేస్తామన్నారు. మండంలో రెండు వేల ఎకరాల్లో ధాన్యం దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనాలుగా నమోదు చేశామని చెప్పారు. వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నేతాజీ మాట్లాడుతూ ఒకవేళ రైతు ఇష్టపడితే ప్రైవేట్ వ్యాపారులకైనా, బయట మిల్లర్లకైనా ధాన్యాన్ని అమ్ముకునేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించందన్నారు. జిల్లా పౌరసరఫరాల మేనేజర్ కె.శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలమేరకు తడిచిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామన్నారు. జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ధాన్యం సేకరణకు అవసరమైన గోనె సంచులను ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తోందన్నారు. ఒకవేళ రైతులే సమకూర్చుకుంటే దానికైన ఖర్చును ప్రభుత్వం తిరిగి చెల్లిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబటి నిర్మల, ఏఎంసీ చైర్మన్ మూకళ్ల తాతబాబు, మండల పార్టీ నాయకులు చిట్టి జనార్దనరావు, తహసీల్దార్ ఎస్.వెంకట్రావు, వ్యవసాయాధికారి ఉషాకుమారి, పీఏసీఎస్ అధ్యక్షుడు గొండు కృష్ణమూర్తి, డైరెక్టర్లు ఎం.రమణారావు, సీఈఓ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పంటనష్టం అంచనా వేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ చిరంజీవి

ఎచ్చెర్ల: మిచాంగ్ తుఫాన్‌తో కురిసిన వర్షాల కారణంగా వాటిల్లిన పంట నష్టం అంచానాలు వేసి ఇన్‌పుట్ సబ్సిడీ కోసం ప్రభుత్వానికి నివేదికలను తయారు చేయాలని ఎంపీపీ మొదలవలస చిరంజీవి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంటనష్టం అంచనాలకు వ్యవసాయ, రెవెన్యూ, ఆర్‌బీకే సిబ్బందిని సమాయత్తం చేయాలని సూచించారు. క్రాప్ ఇన్సురెన్స్ కోసం పంటకోత ప్రయోగాల నివేదికలు తయారు చేయాలన్నారు. రబీ సీజన్‌లో ఆరుతడి పంటలు వేయాలన్నారు. తోటపాలెం ఎత్తిపోతల పథకం మంజూరుకు ప్రతిపాదనలు పంపించాలని సమావేశంలో తీర్మానించారు. తొమ్మిది గంటల ఉచిత విద్యుత్ సరఫరాకు లైన్లను ఆధునీకరించాలని కోరారు. కొబ్బరి, జీడి, మామిడి మొక్కలను ఉచితంగా సరఫరా చేయాలన్నారు. మండల వ్యవసాయన సలహామండలి అధ్యక్షుడు బొడ్డేపల్లి సుధాకర్, తహసీల్దార్ టి.సత్యన్నారాయణమూర్తి, ఎంపీడీవో రమాదేవి, వ్యవసాయ అధికారి సురేష్‌కుమార్, వైస్ ఎంపీపీ బెండు రామారావు, ఈవోపీఆర్‌డీ ఈశ్వరమ్మ, ఇరిగేషన్ ఏఈ జీవీ రమణ, పశువైద్యాధికారి వెంకటరమణ పాల్గొన్నారు.

రాజ్యాధికారంలో సముచిత స్థానం కల్పించాలి



మాట్లాడుతున్న లాకా వెంగళరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): అత్యధిక శాతం ఉన్న బీసీలకు రాజ్యాధికారంలో సముచిత స్థానం కల్పించాలని కోరుతూ మరో స్వాతంత్ర పోరాట రథయాత్రను ప్రారంభించినట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు అన్నారు. ఇచ్ఛాపురంలో ప్రారంభమైన రథయాత్ర శుక్రవారం శ్రీకాకుళం చేరుకుంది. ఈ సందర్భంగా వైఎస్సార్ కూడలిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీసీలకు సముచిత స్థానం కల్పించిన పార్టీలకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో జాతీయ కన్వీనర్ వై.నాగేశ్వరరావు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పిట్ట చంద్రపతి రావు, రాష్ట్ర కన్వీనర్ ఆవుల నర్సింగరావు, జిల్లా నాయకులు కొరుపూరు గజపతిరావు, గద్దిబోయిన కృష్ణయాదవ్, కాళ్ల వెంకటరావు, చౌదరి లక్ష్మణరావు, పి.సుగుణారెడ్డి, అలపాన త్రినాథరెడ్డి, కోనాడ నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

రబీలో రాయితీపై అపరాలు



సమావేశంలో మాట్లాడుతున్న జేడీ శ్రీధర్

గార: తుఫాన్ నేపథ్యంలో రబీ కాలానికి సంబంధించిన అపరాల విత్తనాలను రాయితీపై అందిస్తామని వ్యవసాయ శాఖ జేడీ కె.శ్రీధర్ అన్నారు. శుక్రవారం గార మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గొండు రఘురామ్ అధ్యక్షతన వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాల వల్ల ధాన్యం తడిస్తే కొనుగోలు సమయంలో నిబంధనల సడలింపు ఉంటుందన్నారు. ఇంకా పంట కోయని వివరాలు సిద్ధం చేయాలని సూచించారు. అంతర్జాతీయ చిరుదాన్యాల దినోత్సవం సందర్భంగా మండలంలో యూనిట్లు మంజూరు చేస్తామన్నారు. సమావేశంలో సలహా మండలి అధ్యక్షుడు అరవల చిన్న అప్పారావు, శిమ్మ నేతాజీ, ప్రత్యేకాధికారి బి.వెంకటరమణ, ఏడీఏ బగ్గు రజిని, అరవల రామకృష్ణ, మార్పు పృథ్వీరాజ్, ఎంపీడీఓ సంజీవ రమణయ్య, పీస శ్రీహరిరావు, ఏఓ డి.పద్మావతి పాల్గొన్నారు.

వృత్తిపై అంకితభావం అవసరం



డిగ్రీ పట్టాలు అందుకున్న విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: నిర్వహిస్తున్న వృత్తి ఏదైనా అంకిత భావంతో పనిచేస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని ఆంధ్రా విశ్వవిద్యాలయం ఫార్మసీ విభాగాధిపతి డాక్టర్ కె.ఈశ్వర్‌కుమార్ అన్నారు. ఎచ్చెర్లలోని వెంకటేశ్వరా ఫార్మసీ కళాశాలలో శుక్రవారం డాక్టర్ ఆఫ్ ఫార్మసీ(ఫార్మా.డీ) 2022–23 ఏడాది నాలుగవ స్నాతకోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు ఒరిజనల్ సర్టిఫికెట్లను ప్రదానం చేసేందుకు ముఖ్యఅతిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ఫార్మా రంగం విస్తరిస్తోందన్నారు. ఫార్మసీ పూర్తిచేసిన వారికి మంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఈవీ నాగోజీ మాట్లాడుతూ.. ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో చదివిన విద్యార్థులకు మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ తారక రామారావు, హెచ్‌వోడీ భానోజీరావు పాల్గొన్నారు.

దివ్యాంగులకు కృత్రిమ అవయవాల పంపిణీ



కృత్రిమ అవయవాలు అందిస్తున్న దాతలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఆత్మస్థైర్యం ఉంటే అంగవైకల్యం అడ్డుకాదని దివ్యాంగుల వెల్ఫేర్, దివ్యాంగుల అసిస్టెంట్ డైరెక్టర్ కె.కవిత అన్నారు. లయన్స్ క్లబ్ శ్రీకాకుళం హర్షవల్లి క్లబ్ సభ్యురాలు కల్లేపల్లి ఉషారాణి పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం బాపూజీ కళామందిర్‌లో 50 మందికి ఉచితంగా కృత్రిమ అవయవాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ గౌరవ అధ్యక్షుడు హారికా ప్రసాద్ మాట్లాడుతూ దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు ఉచిత అందించడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో అధ్యక్షురాలు కరణం శోభారాణి, సెక్రటరీ ఆర్.శ్రీనివాసరావు, ట్రెజరర్ అప్పలనాయుడు, జోనల్ చైర్‌పర్సన్ చింతాడ కృష్ణమోహన్, సీనియర్ జర్నలిస్ట్ శాసపు జోగినాయుడు, సభ్యులు పాలిశెట్టి మధుబాబు, సాహుకారి నాగేశ్వరరావు, భాషా షరీఫ్ పాల్గొన్నారు.

ఓటు హక్కు తప్పనిసరి

శ్రీకాకుళం న్యూకాలనీ: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు 18 ఏళ్లు నిండిన యువతీయువకులు వెంటనే ఓటు హక్కు పొందాలని లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షుడు పొన్నాడ రవికుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం తమ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో మంచి నాయకులను ఎన్నుకునే అవకాశం ఒక్క ఓటు ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

క్రీడా దుస్తులు పంపిణీ



క్రీడా దుస్తులను వితరణ చేస్తున్న పూర్వ విద్యార్థులు

జి.సిగడాం: పాఠశాలల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు, గ్రామస్తులు సహకరించాలని డి.ఆర్.వలస జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.కూర్మినాయుడు కోరారు. పాఠశాలలో 1992–93 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆర్థిక సహాయంతో ప్రస్తుతం చదువుతున్న 20 మందికి క్రీడా దుస్తులను శుక్రవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో రాణించాలని విద్యార్థులకు సూచించారు. పీడీలు కొంచాడ బెనర్జీ, బి.రాజ్యలక్ష్మిలు విద్యార్థులకు క్రీడల్లో శిక్షణ ఇస్తారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుమరావు లక్ష్మణరావు, బి.కృష్ణంనాయుడు, ఆనంద రాజు, కృష్ణంబాబు ఉన్నారు.

బదిలీపై వెళ్లిన డీటీకి సత్కారం



హనుమంతరావును సత్కరిస్తున్న దృశ్యం

జి.సిగడాం: విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేసే ఉద్యోగికి ప్రజల నుంచి మంచి గుర్తింపు ఉంటుందని తహసీల్దార్ పప్పల వేణుగోపాలరావు అన్నారు. మండల భూసర్వే డీటీగా విధులు నిర్వహించి పదోన్నతిపై వెళ్లిన హనుమంతరావును కార్యాలయ సిబ్బంది శుక్రవారం దుశ్శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జి.సిగడాం మండలంలో 21 గ్రామాల్లో చేపట్టిన రీ భూసర్వేలో హనుమంతురావు సమర్థవంతంగా విధులు నిర్వహించడంతో పక్కాగా రికార్డులు తయారు చేశామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎస్.నిర్మల, ఆర్ఐ రామచంద్రరావు, సర్వేయర్ కృష్ణారావు, వీఆర్వోల సంఘం నాయకులు పొట్నూరు జగన్నాథం, భూపతి నర్సింగరావు ఉన్నారు.

తుఫాన్ బాధితులను ఆదుకోవాలి

శ్రీకాకుళం: తుఫాన్ బాధితులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రెల్ల సురేష్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

సంక్షిప్తంగా..


నేటితో ముగియనున్న అభ్యంతరాల స్వీకరణ



సమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధులు

రణస్థలం: ఎచ్చెర్ల నియోజకవర్గంలోని 309 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల సమగ్ర జాబితాను సిద్ధం చేస్తున్నట్టు తహసీల్దార్ సనపల కిరణ్‌కుమార్ చెప్పార. ఇందులో భాగంగా శనివారంతో అభ్యంతరాల స్వీకరణ గడువు ముగిస్తుందని స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని కార్యాలయంలో వివిధ పార్టీల ప్రతినిధులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో బీఎల్‌వోలు, గ్రామస్థాయి ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించి సమగ్ర ఓటర్ల జాబితా సిద్ధం చేస్తామన్నారు. 18 ఏళ్లు నిండిన వారు ఓటు కోసం నమోదు చేసుకునే అవకాశం ఇంకా ఉందన్నారు. తొలగింపులు, చేర్పులు, మార్పులపై త్వరితగతిన వివరాలు అందజేయాలన్నారు. సమావేశంలో లావేరు, ఎచ్చెర్ల, జి.సిగడాం తహసీల్దార్లు దిలీప్ చక్రవర్తి, టి.సత్యనారాయణ, పప్పల వేణుగోపాల్, ఎన్నికల డీటీ జి.కె.శ్రీనివాస్ ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో దీపారాధన



ప్రత్యేక అలంకరణలో ఉమాజఠలేశ్వరుడు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నక్కవీధిలో ఉమాజఠలేశ్వరస్వామి దేవాలయంలో కార్తీక మాస బహుళ ఏకాదశి సందర్భంగా దీపారాధన నిర్వహించారు. అర్చకులు అశ్వినీకుమార్, మహేష్ ఆధ్వర్యంలో భక్తులు 10 వేల దీపాలు వెలిగించారు. అంతకుముందు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయాలని వినతి



ట్రాఫిక్ డీఎస్పీతో మాట్లాడుతున్న రామ్‌మనోహర్‌నాయుడు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నగరంలో వాహనదారుల వేగాన్ని తగ్గించేందుకు పలు ప్రధాన కూడళ్లలో స్పీడ్‌బ్రేకర్లను ఏర్పాటుచేయాలని వైఎస్సార్ సీపీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు కోరారు. ఈ మేరకు శుక్రవారం ట్రాఫిక్ డీఎస్పీ ప్రసాద్‌ని కలిసి ప్రమాదాల తీరును వివరించారు. ప్రధానంగా పాలకొండ రోడ్డులోని విజయగణపతి ఆలయం, గాంధీపార్కు, 80 అడుగుల రోడ్డులో స్పీడ్‌బ్రేకర్లను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో కాపవరపు సీజు, తోట తారక్, ఊడి సునీత, శ్రీధర్ శర్మ, వీనస్ ఆప్టికల్ హరి, ఈశ్వర్ పాల్గొన్నారు.

భగన్నామ స్మరణతో సత్ఫలితాలు



డాక్టర్ అనంతలక్ష్మి

అరసవల్లి: భగవంతుని నామస్మరణతో అద్భుత ఫలితాలు వస్తాయని ప్రముఖ ప్రవచనకర్త డాక్టర్ అనంతలక్ష్మి అన్నారు. ధర్మపథం కార్యక్రమంలో భాగంగా అరసవల్లి సూర్యనారాయణ ఆలయంలో శుక్రవారం ఆమె ప్రసంగించారు. ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఈవో వి.హరిసూర్యప్రకాష్‌ల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముందుగా లలితా సహస్రనామార్చన, విష్ణు సహస్రనామార్చనలను చేసి అనంతరం పలు భక్తిగీతాలు ఆలపించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్‌లో రోగి బంధువుల ఆందోళన

శ్రీకాకుళం: జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో పి.అసిరమ్మ (60) అనే మహిళ శుక్రవారం మృతి చెందగా.. వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ ఆమె బంధువులు ఆందోళన చేశారు. పొందూరు మండలం బురిడి కంచరాం గ్రామానికి చెందిన అసిరమ్మ ఊపిరితిత్తుల వ్యాధితో రిమ్స్‌లో ఈ నెల 4న చేరింది. తీవ్రమైన న్యూమోనియా వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించి ఎమర్జెన్సీ వార్డులో ఉంచి వైద్య సేవలు అందించారు. శుక్రవారం ఆమె మృతి చెందింది. ఇంతలో రోగి బంధువులు టీడీపీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్‌కు ఫోన్ చేయగా ఆయన ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే అసిరమ్మ మృతి చెందిందని బంధువులు ఆరోపించారు. టీబీ వైద్యులు మాత్రమే చికిత్స చేశారని, సీనియర్ వైద్యులు పట్టించుకోలేదని ఆందోళన చేశారు. కాగా, అసిరమ్మ ఆరోగ్య పరిస్థితి విషమించిన తర్వాతే ఆస్పత్రికి తెచ్చారని డాక్టర్లు స్పష్టం చేశారు.

రబీలో ఈక్రాప్ నమోదు తప్పనిసరి



మాట్లాడుతున్న శారద

జి.సిగడాం: రబీ సీజన్‌లో రైతులు పండించే ప్రతి పంటకు తప్పనిసరిగా ఈక్రాప్ నమోదు చేయాలని మండల వ్యవసాయశాఖ అధికారిణి యర్రా శారద అన్నారు. స్థానిక రైతుభరోసా కేంద్రంలో సచివాలయాల అగ్రికల్చర్ అసిస్టెంట్లతో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. సేంద్రియ ఎరువులతో పంటలు సాగు చేస్తే తక్కువపెట్టుబడితో అధిక దిగుబడులు సాధించగలరన్నారు. ఆధునిక వ్యవసాయ విధానాన్ని రైతులు అవలంబించేలా చూడాలన్నారు. సమావేశంలో ఉద్యానవనశాఖ అధికారిణి అనుషా, ఏవో సుహాషిని, అగ్రికల్చర్ అసిస్టెంట్లు అలుగోలు లక్ష్మీనారాయణ, పొగిరి నారాయణరావు, కుమరాపు సుగుణాకరరావు, హేమంత్, హరీష్, హరికృష్ణ, కుసుమ, సంతోస్, రవి, అనూషా ఉన్నారు.